క్లుప్తంగా

దివ్యాంగులకు వైద్య పరీక్షలు



మండపేటలో దివ్యాంగ ఉపకరణాల వివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట భవిత కేంద్రంలో సోమవారం ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మెడికల్ అసెస్మెంట్ క్యాంపు నిర్వహించారు. మండపేట మండలం నుంచి 29 మంది, కపిలేశ్వరపురం నుంచి 20, ఆలమూరు నుంచి 20, మొత్తం 69 మంది దివ్యాంగ చిన్నారులు హాజరయ్యారు. ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ఉపకరణాలు నిమిత్తం వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన ఉపకరణాలను సమకూర్చేందుకు 69 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మండపేట మండల విద్యాశాఖాధికారులు రామచంద్రరావు, సోమిరెడ్డి, సహిత విద్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండపేట టౌన్‌లో రెండు బార్లకు నోటిఫికేషన్



ఐడీ నాగేశ్వరరావు

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలోని మండపేట టౌన్‌లో రెండు బార్లు ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఐడీ నాగేశ్వరరావు తెలిపారు. ఆలమూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఎక్సైజ్ బార్లకు సంబంధించిన దరఖాస్తులను ఈనెల 18 నుంచి 26 వరకు సర్కిల్ కార్యాలయంలో స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు రూ.5.10 లక్షల డీడీ (నాన్ రిఫండబుల్) ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈనెల 28న లాటరీ పద్ధతిలో లైసెన్స్ కేటాయింపు జరుగుతుందన్నారు. అయితే ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు ఉంటేనే లాటరీ నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఎక్సైజ్ సీఐ వివరించారు.

రామాలయ పునర్నిర్మాణానికి భూమి పూజ



వెంకటాయపాలెంలో రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సూర్యప్రకాశ్ పృథ్వీరాజ్ తదితరులు

రామచంద్రపురం రూరల్: వెంకటాయపాలెంలో వంతెన వద్ద శెట్టిబలిజ కోదండ రామాలయం పునర్నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్యప్రకాశ్ సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ రూ.20 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్, గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, ఉప సర్పంచ్ గంధం బుజ్జి, ఎంపీటీసీ కణితి వెంకటేశ్వరి, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, సుబ్బారావు దంపతులు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దడాల రవికుమార్, గ్రామ పెద్దలు గంధం పుల్లయ్యకాపు, తోట శ్రీనివాస్, శెట్టిబలిజ సంఘ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తి వంతెనతో ఇక్కట్లు



కోరంగి కెనాల్‌పై దొరగారిపాలెం వద్ద అసంపూర్తిగా మిగిలిపోయిన వంతెన

కాజులూరు: తణుకువాడ మంజేరు గ్రామాల మధ్య కోరంగి కెనాల్‌పై దొరగారిపాలెం వద్ద నిర్మించిన వంతెన అసంపూర్తిగా మిగిలిపోయింది. సుమారు 14 సంవత్సరాల క్రితం జిల్లా పరిషత్ నిధులు రూ.2.80 లక్షల వ్యయంతో అధికారులు వంతెన నిర్మాణం చేపట్టారు. నిధులు సరిపడకపోవడంతో కాలువపై శ్లాబ్ ఏర్పాటు చేశారు. కానీ ఇరువైపులా అప్రోచ్, రక్షణ గోడల నిర్మాణాన్ని వదిలివేశారు. దీంతో వంతెన నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. వాహనాల రాకపోకలకు అవకాశం లేకపోవడంతో స్థానికులు కనీసం సైకిల్, మోటారుసైకిల్ వంటి వాహనాలు ప్రయాణించేందుకైనా వీలు కల్పించుకోవాలనే ఉద్దేశంతో వంతెనకు ఇరువైపులా గ్రావెల్ మట్టి వేసి రాకపోకలకు ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే రక్షణ గోడలు లేకపోవడంతో వాహనాలు అదుపు తప్పి పంటకాలువలోనికి బోల్తా పడున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గ్రావెల్ మట్టి కరిగిపోతే సైకిల్, మోటారుసైకిల్ తదితర వాహనాలు వంతెన పైకి ఎక్కేందుకు వీలు లేకుండా పోతుందని గ్రామస్తులు చెబుతున్నారు. దొరగారిపాలెంలోని ప్రజలు బయటి ప్రపంచంలోనికి రావాలంటే ఈ వంతెన దాటి ప్రయాణించాల్సిందే. అధికారులు స్పందించి ఈ అసంపూర్తి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని బాధిత ప్రజలు కోరుతున్నారు.

గోదావరి ఉగ్రరూపం

- గంట గంటకూ పెరుగుతున్న ప్రవాహం
- ఆందోళనలో పరివాహక ప్రాంత ప్రజలు



కోటిపల్లి రేవులో పుష్కర మెట్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద గోదావరి

కె.గంగవరం: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి కోటిపల్లి వద్ద ఉప్పొంగి ప్రవహిస్తోంది. ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే గోదావరి పరివాహక ప్రాంత ప్రజలకు ఆందోళన తప్పడంలేదు. పెరుగుతున్న నదీ ప్రవాహంతో కంటి మీద కునుకు లేకుండా పోతోంది. ఇక్కడ కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌కు భారీగా వరదనీరు చేరుతోంది. వరదనీటిని కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోనికి వదలడంలో కోటిపల్లిలో ఈ నెలలో రెండో సారి వరద పెరిగింది. మండల పరిధిలోని కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు వరద గోదావరి ఉగ్రరూపం దాల్చింది. సముద్రంలోనికి వరద నీరు కలిసేందుకు ఉరకలు వేస్తూ పవరళ్లుతొక్కుతోంది. సోమవారం ఉదయం నుంచి గంట గంటకు గోదావరి పెరుగుతూనే ఉందని స్థానికులు అంటున్నారు. రాత్రికి మరింత పెరిగితే కోటిపల్లిలో మత్స్యకార కాలనీ మొత్తం నీటమునుగుతుందని వాపోతున్నారు.

నిలిపోయిన పంటు ప్రయాణం

గోదావరి వరదనీరు భారీగా వచ్చి చేరడంతో కోటిపల్లి–ముక్తేశ్వరం పంటు ప్రయాణాన్ని రెవెన్యూ అధికారులు గత నెల రోజులుగా నిలిపివేశారు. రేవు దాటిన తరువాత ముక్తేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన కంకర రోడ్డు గోదావరిలో కొట్టుకుపోయింది. దీంతో పాటు ఎన్నడు లేని విధంగా రెండు తూరలు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో పంటు ప్రయాణానికి ఆటంకం కలిగింది.

ప్రజలు అప్రమత్తం

ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరికి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ప్రసాద్ ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మండల పరిధిలోని సుందరపల్లి, కూళ్ల గ్రామాలతో పాటు గోదావరి కోతకు గురవుతున్న ప్రాంతాల్లో వారు పర్యటించారు. మరో రెండు మూడు రోజుల్లో గోదావరి ఉధృతి పెరిగే అవకాశం ఉందని, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. గోదావరిలో అనుమతి లేకుండా ఏ బోటు, నాటు పడవ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులను కూడా అప్రమత్తంగా చేశామని గట్టు బలహీనంగా ఉన్న చోట్ల తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ధర్మ పరిరక్షణే ధ్యేయం

- వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి గాడ్
- పీఠంలో ముగిసిన వార్షికోత్సవాలు



పీఠంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాయవరం: ధర్మ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ తమ విద్యుక్తధర్మాన్ని నిర్వర్తించాలని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులకు పిలుపునిచ్చారు. పీఠంలో నిర్వహిస్తున్న 53వ వార్షికోత్సవాల ముగింపును పురస్కరించుకుని సోమవారం ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని తెలిపారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

తిరుమల తిరుపతి దేవస్థానం వారు పీఠానికి అందజేసిన శ్రీదేవి, భూదేవి సమేత విజయ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు తిరుమంజన సేవ నిర్వహించారు. పీఠం ఆవరణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉత్సవ విగ్రహాలకు పీఠాధిపతి గాడ్ సమక్షంలో ప్రత్యేక అభిషేకాలు, తులసి దళాలతో అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 11 గంటలకు తిరుమల వైఖానస పండితులతో శ్రీవారి దివ్య కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి రీజనల్ మాజీ కోఆర్డినేటర్ కందర్ప హనుమాన్, పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకటకామేశ్వరి, బలిజేపల్లి రమ, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం

కాజులూరు: బీసీల హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం అవసరమని కాజులూరుకు చెందిన బీసీ సంక్షేమ సంఘం నాయకుడు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ అన్నారు. సోమవారం గొల్లపాలెంలో జరిగిన సంఘ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 53 శాతం పైబడి ఉన్న బీసీలకు చట్టసభల్లోనూ 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. దీనిపై పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టి రాజ్యాంగ హక్కులు కల్పించేలా వివిధ పార్టీలలో ఉన్న బీసీ నేతలందరూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల బీసీ సంఘ సభ్యులు కడలి రాంపండు, స్థానిక మాజీ ఎంపీటీసీ మేడిశెట్టి వెంకటరమణమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం



వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం చేస్తున్న శెట్టిబలిజ సంఘం నేతలు



మండపేటలో రాట ముహూర్తం పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్

రాయవరం: స్థానిక శెట్టిబలిజ రామాలయం వద్ద సోమవారం వినాయక చవితి ఉత్సవాలకు రాట ముహూర్తం చేశారు. బస్టాండ్ సెంటర్‌లోని రామాలయం వద్ద శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ కమిటీ సభ్యుడు దుర్గాపు వెంకన్నబాబు చేతుల మీదుగా రాట ముహూర్తం పూజలు నిర్వహించారు. ఈ నెల 27 నుంచి వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కాలా రాంబాబు, కురుపూడి సూర్యనారాయణ, కాలా శివశంకర్, గుడాల వీరవెంకటసత్యనారాయణ, కాలా శ్రీను, బొడ్డు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు పందిరి రాట

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం ఐదో వార్డులో సోమవారం గణపతి నవరాత్ర ఉత్సవాలకు పందిరి రాట వేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి కొబ్బరికాయ కొట్టి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలకు రాట ముహూర్తం నిర్వహించారు. గణపతి నవరాత్ర ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఎర్నేని సత్యవతి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి బహిరంగ క్షమాపణ చెప్పాలి

ఎన్టీఆర్ సేవా సమితి గౌరవాధ్యక్షుడు వాసంశెట్టి శ్యామ్



ద్రాక్షారామలో ఎమ్మెల్యే ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తున్న ఎన్టీఆర్ సేవా సమితి కార్యవర్గ సభ్యులు

రామచంద్రపురం రూరల్: తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని రామచంద్రపురం నియోజకవర్గ ఎన్టీఆర్ సేవా సమితి గౌరవాధ్యక్షుడు వాసంశెట్టి శ్యామ్ డిమాండ్ చేశారు. సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు సాదే రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం ద్రాక్షారామ సూర్య సినీమాక్స్ థియేటర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నటించి వార్ 2 సినిమా విడుదల సందర్భంగా ఎన్టీఆర్‌ను అసభ్య పదజాలంతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రసాద్ క్షమాపణ చెప్పాలని, లేకుంటే జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ద్రాక్షారామ ఎస్సై ఎం. లక్ష్మణ్‌కు ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సేవా సమితి కార్యదర్శి శీలం మణికంఠ, సంయుక్త కార్యదర్శి పాటి సుబ్బు, ప్రచార కార్యదర్శి శేఖర్, కార్యవర్గ సభ్యులు యానపు వీర్రాజు, దొమ్మేటి సతీష్, బాబి, సుబ్బు, లక్ష్మణ్, భీమేష్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కాజులూరు: అల్ప పీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో అంతా ఇబ్బంది పడుతున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని కాజులూరు, చేదువాడ, దుగ్గుదుర్రు, కుయ్యేరు, ఉప్పుమిల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాజులూరులో ఆయన రైతులతో మాట్లాడుతూ తుపాను కారణంగా మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ అధికారులు చెబుతున్నారన్నారు. రైతులు ఎప్పటికప్పుడు పొలంలో నుంచి వర్షపునీరు బయటికి పోయేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నీరు తగ్గిన వెంటనే ఎకరానికి 30 కిలోలు యూరియా, 15 కిలోలు పొటాష్ ఎరువును పైపాటుగా వేసుకోవాలన్నారు. తెగుళ్ళ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు వ్యాక్సిన్లు వేయాలి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సత్యనారాయణ



ద్రాక్షారామ ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో భాగంగా చిన్నారులకు వ్యాక్సినైజేషన్ ప్రక్రియను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బీవీవీ సత్యానారాయణ పీహెచ్‌సీల వైద్యాధికారులకు సూచించారు. ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో వ్యాక్సినైజేషన్ ప్రక్రియను ఆయన సోమవారం జిల్లా స్టాటిస్టికల్ అధికారి వీరబాబుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎం అండ్ హెచ్‌ఓ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 23 వరకు స్పెషల్ స్కూల్ వాక్సినేషన్ డ్రైవ్‌ను జిల్లా అంతా అమలు చేస్తున్నట్టు తెలిపారు. 5 నుంచి 7 సంవత్సరాల పిల్లలకు డీపీటీ వ్యాక్సిన్, 10 నుంచి 16 సంవత్సరాల వయస్సు పిల్లలకు టీడీ వ్యాక్సిన్‌ను పాఠశాలల్లో అందిస్తున్నట్టు వివరించారు. ఈ వ్యాక్సిన్లు పిల్లలను డిఫ్తీరియా, గొంతు దగ్గు, ధనుర్వాతంల నుంచి రక్షిస్తాయన్నారు.

జిల్లా వ్యాప్తంగా 1582 ప్రభుత్వ, 480 ప్రైవేటు పాఠశాలల్లో..

జిల్లా వ్యాప్తంగా 1582 ప్రభుత్వ, 480 ప్రైవేటు పాఠశాలల్లో ఈ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టినట్టు తెలిపారు. సోమవారం నుంచే ప్రారంభించాల్సి ఉండగా వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. వేసిన ప్రతి వ్యాక్సిన్ యూ విన్ పోర్టల్‌లో నమోద చేస్తారన్నారు. అవసరమైన వారు సర్టిఫికెట్లు పొందవచ్చని సూచించారు. గురుకుల విద్యార్థులకు వ్యాక్సిన్ల వల్ల ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.స్వాతి భవాని, డివిజనల్ సూపర్‌వైజర్ జి. కమల్ శేషు, ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ వీరవేణి, సూపర్‌వైజర్లు రత్నం, వరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలి



ఆర్డీవో అఖిలకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ భవానీ తదితరులు

రామచంద్రపురం: ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేస్తున్న సమయంలో రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు అనువుగా ఉండేందుకు కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ ఆర్డీవోకు డి.అఖిలకు ఎంపీపీ అంబటి భవానీ నేతృత్వంలో రామచంద్రపురం మండల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ భవానీ మాట్లాడుతూ తమ సమస్యలను విన్నవించేందుకు, వివిధ పనులు నిమిత్తం అమలాపురం వెళ్లేందుకు యానాం మీదుగా జిల్లా ప్రధాన కేంద్రం అమలాపురం సుమారు 75 కిలోమీటర్ల దూరం ప్రయాణించి వెళ్లాల్సి వస్తుందన్నారు. కాకినాడ జిల్లా ప్రధాన కేంద్రం రామచంద్రపురం నుంచి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉండటం వల్ల పరిపాలనా సేవలు వేగంగా, సమయానికి అందే అవకాశం ఉంటుందన్నారు. కాకినాడ జిల్లాలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని విలీనం చేయాలని కోరుతూ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి ఆర్డీవోకు అందించినట్టు ఎంపీపీ భవానీ తెలిపారు. రామచంద్రపురం మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

జేఏసీ ఆధ్వర్యంలో

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ ఏర్పడిన జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో డి.అఖిలకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ నేతలు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ అంబటి భవానీని కలిసి వినతిపత్రం అందజేశారు.

రహదారికి భూమి పూజ

ఆలమూరు: మండలంలోని మడికి శివారు చిలకలపాడులో నాబార్డు మంజూరు చేసిన రూ.1.14 కోట్లతో నిర్మించనున్న రహదారికి సోమవారం భూమి పూజ జరిగింది. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రహదారి నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఏఎంసీ చైర్మన్ కొత్తపల్లి వెంకటలక్ష్మి, దొండపాటి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్, గ్రామ పెద్దలు



కోరుమిల్లిలో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేస్తున్న దాత సుబ్రహ్మణ్యం దంపతులు

కపిలేశ్వరపురం: మండలంలోని కోరుమిల్లి గౌతమి గోదావరి నదీ తీరాన గోపాలకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన సలాది సుబ్రహ్మణ్యం, వీరవేణి దంపతులు ఆర్థిక సౌజన్యంతో విగ్రహాన్ని నెలకొల్పారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. స్వామిని కీర్తిస్తూ భజన భక్త బృందం సభ్యులు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో దాత కుమారులు కార్తీక్, యుగంధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యవాడలో...

కె.గంగవరం: సత్యవాడలో నూతనంగా నిర్మించిన మహాగణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, వరాల కనకదుర్గ అమ్మవారి సువర్ణయాత్ర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవారం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేదపండితులు భాస్కర యాగేశరి, యలమంచిని కృష్ణమూర్తి, బ్రహ్మశ్రీ ప్రసాద్‌శర్మ బ్రహ్మత్వంలో ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించి, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయం వద్ద మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లు, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అంతర పంటలతో ధీమా

- అంతర పంటలతో అదనపు ప్రయోజనం
- నియోజకవర్గంలో ఆసక్తి చూపుతున్న రైతులు
- ప్రధాన పంటతోనే సాగు
- అనుకూలిస్తున్న మార్కెట్ పరిస్థితులు



కేదారిలంకలో కొబ్బరి తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న పసుపు



అద్దంకివారిలంలో కొబ్బరితోటలో అంతర పంటగా ఖోఖో సాగు

కపిలేశ్వరపురం: ఉద్యాన పంటలకు కోనసీమ జిల్లా వ్యాప్తంగా అధిక ప్రాధాన్యం సంతరించుకుంటుంది. అందునా గోదావరి తీర ప్రాంతంలో ఉద్యాన పంటలు లాభసాటియే కాకుండా పంటల సాగు సంప్రదాయబద్ధం కూడాను. అంతర పంటలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా, ఇది భూమి ఉత్పాదకతను పెంచుతుంది, పోషకాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి సహాయపడుతుంది కలుపు మొక్కల పెరుగుదలను తగ్గిస్తుంది. ఒక పంట దెబ్బతిన్నప్పటికీ, ఇతర పంటల నుంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుంది, ఇది రైతుల ఆదాయాన్ని స్థిరీకరించడానికి సహాయపడుతుంది. ఉద్యాన సాగుపై రైతులు ఆసక్తి చూపడంతో అధిక ప్రయోజనాలను పొందవచ్చు. ప్రధాన పంట కొనసాగుతుండగనే అంతర పంటలు వేసే మార్గం ఎంతో ప్రయోజనకరం, ఆచరణసాధ్యమని ఉద్యానశాఖాధికారులు చెబుతున్నారు. నియోజవర్గంలో అంతర పంటల సాగు తీరుపై ఈ కథనం..

సాగు విస్తీర్ణం ఇలా..

మండపేట నియోజకవర్గంలో సుమారు 47,418 ఎకరాల్లో వరిని సాగుచేస్తున్నారు. మరో 4వేల ఎకరాల్లో ఉద్యాన పంటలను సాగుచేస్తున్నారు. ఉద్యానపంటల సాగు మండపేట, రాయవరం మండలంలో పరిమితంగా ఉండగా లంక భూమి ఉన్న కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, కపిలేశ్వరపురం, తాతపూడి, కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో కొబ్బరి, అరటి, కంద, ఖోఖో, పసుపు, మొక్కజొన్న, కూరగాయలను సాగుచేస్తున్నారు. కపిలేశ్వరపురం, కోరుమిల్లి, అంగర, తాతపూడి, కేదారిలంక, అద్దంకివారిలంకల్లో కొబ్బరి తోటలో అరటిని అంతర పంటగా 700 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. అద్దంకివారిలంక, కోరుమిల్లి, తాతపూడి లంకల్లోని 400 ఎకరాల్లో కూరగాయలను పండిస్తున్నారు. కూరగాయలను ప్రధాన పంటగా మరో 1,200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఖోఖోను అంతర పంటగా అద్దంకివారిలంలో 50 ఎకరాల్లో , కేదారిలంకలో పది, కపిలేశ్వరపురంలో పది ఎకరాల్లోనూ సాగు చేస్తున్నారు. మండపేట మండలం ఏడిద, వేములపల్లి గ్రామాల్లో సుమారు 90 ఎకరాల్లో సాగులో ఉంది.

అంతర పంటలతో ప్రయోజనం

కొబ్బరి, ఆయిల్ ఫాం ప్రధాన పంటలుగా సాగుతుండగా అదే తోటలో పలు రకాలను సాగు చేయవచ్చని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. ప్రధాన పంటకు సమకూర్చే నీరు, ఎరువులు, పురుగు మందులే అంతర పంటలకూ ఉపయోగపడతాయి. అదనపు ఖర్చు అంతగా ఉండదు. పైగా అంతర పంట సాగు వల్ల భూసారం పరిరక్షించబడుతుంది. అంతర పంటలుగా కూరగాయలు, ఖోఖో, పసుపు, కొత్తిమీర, తదితర పంటలను సాగు చేయవచ్చు.

మార్కెట్ పరిస్థితి ఇలా..

అరటి పంటను రావులపాలెం, మండపేట మార్కెట్‌లలో రైతులు నేరుగా విక్రయిస్తున్నారు. కూరగాయలను కొత్తపేట, రావులపాలెం, భీమవరం, కాకినాడలలో విక్రయిస్తున్నారు. పెద్ద రైతులు నేరుగా బెంగళూరుకు తరలించి నేరుగా విక్రయాలు జరుపుతున్నారు. ఖోఖో విత్తనాలను కేడ్బరీ చాక్‌లెట్ కంపెనీ ప్రతినిధులే రైతులకు అందజేస్తున్నారు. పంట పక్వానికి వచ్చిన తర్వాత వారే స్వయంగా కొనుగోలు చేస్తున్నారు.

అన్నీ అనుకూలిస్తే అధిక లాభాలు

కొబ్బరి, ఉద్యాన పంటల సాగులో పరిస్థితులన్నీ అనుకూలిస్తే మంచి లాభాలను సాధించవచ్చని అనుభవాలు చెబుతున్నాయి. ఎకరాకు సుమారుగా 60 చెట్లుంటాయి. ఒక చెట్టుకు ఏడాదికి 100 కాయలు దిగుబడి వస్తుంది. ఒక కాయ రూ.ఎనిమిదికి విక్రయించినా ఏడాదికి రూ.800 వస్తుంది. 60 చెట్లుకు రూ. 48,000 వస్తుంది. సాగు ఖర్చు ఎకరానికి రూ. 25 వేలు పోనూ రూ.23 వేలు లాభం వస్తుంది. సాగు కష్టం అతి తక్కువ.

ఆసక్తితో చేస్తే మంచి ఫలితాలు



అంతర పంటలను ఆసక్తితో సాగు చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. ప్రధాన పంటకు ఏ మాత్రం నష్ట వాటిల్లకుండా అదనపు ప్రయోజనం చేకూరుతుంది. ఉద్యానశాఖాధికారుల పర్యవేక్షణలో సాగు చేయాలి

అనూష, ఏఓ, ఉద్యాన శాఖ మండపేట.

రైతులకు భద్రత

కూరగాయలు ఏడాది కాలంలో మూడు నెలలకు ఒక పంట చొప్పున నాలుగు రకాల పంటలను సాగు చేయొచ్చు. ఏదైనా సీజన్‌లో మార్కెట్ పరంగానూ, ధర పరంగానూ, ప్రకృతి అనుకూల పరిస్థితిలో ఒక పంట దెబ్బతిన్నా మిగిలిన పంటలు రైతుకు లాభించే అవకాశాలున్నాయి. ఎకరానికి రూ.60 వేలు నుంచి రూ.లక్ష ఖర్చు ఉంటుంది. పరిస్థితులు అనుకూలిస్తే ఏడాదికి రూ.రెండు నుంచి ఆరు రూ.ఆరు లక్షలు ఆర్జించవచ్చు. ఖోఖో కేజీ ధర రూ.300 నుంచి 400 పలుకుతుంది. ఎకరానికి ఖర్చు రూ.40 వేలు ఉంటుంది. ఖర్చుపోనూ ఏడాదికి ఎకరాకు రూ. లక్షకు పైగా మిగులుతుంది.